

# రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080



ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శనివారం 14 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 52 | పేజీలు : 04, వెల రూ.2


## పంచాయతీ ఎన్నికలైనా నిష్పాక్షికంగా జరగాలి



- ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.
- మున్సిపల్, మండల పరిషత్ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో విఫలమైందని ఆరోపించారు.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మిగతా 2లో

- నాటి ఆలోచన మార్చుకున్నా.. జనాభా విధానంపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- బిల్ గేట్స్‌ను అలా ఒప్పించా.. సీఐఐ సదస్సులో ఆసక్తికర విషయాలు చెప్పిన చంద్రబాబు
- అమరావతిలో రూ.174 కోట్ల పెట్టుబడితో ఒబెరాయ్ హోటల్
- 150 ప్రత్యక్ష, 250 పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- త్వరలో వెల్లడికానున్న హోటల్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర వివరాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఫైర్ సైడ్ చాట్‌లో పాల్గొన్న చంద్రబాబు
- హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తెచ్చేందుకు బిల్ గేట్స్‌ను ఒప్పించిన విధానం వెల్లడి
- ఐటీకి ప్రాధాన్యత ఇస్తే నాడు ప్రతిపక్షాలు విమర్శించాయన్న ముఖ్యమంత్రి
- దేశంలోనే తొలిసారి విద్యుత్ సంస్కరణలు తెచ్చింది తానేనని స్పష్టం

## ఏపీ రాజధానిలో ఒబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్

**ఐటీ శకం ముగిసింది.. ఇక ఏఐ, క్వాంటం యుగం**



ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆతిథ్య రంగాన్ని విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రముఖ హోటల్ రంగ సంస్థ ఒబెరాయ్ గ్రూప్ అమరావతిలో ఫైవ్ స్టార్ లగ్జరీ హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నంలో జరుగుతున్న మిగతా 2లో

## రాజమండ్రి నగరపాలక సంస్థపై బీజేపీ జెండా ఎగురవేస్తాం



- రాజమండ్రి నగరపాలక సంస్థపై బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.
- స్థానిక అభ్యర్థికే మేయర్ టికెట్ కేటాయిస్తామని తెలిపారు.
- కార్యకర్తల అభిప్రాయాల మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. మిగతా 2లో

## 'నువ్వు ఇందిరమ్మ కోడలివి, అందుకే నీకు, కాంగ్రెస్‌కు ఓటేస్తాం'

- తెలుగు ప్రజలతో 'ఇందిరమ్మ' అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సోనియా గాంధీ
- కొత్తగా విడుదలైన తన జ్ఞాపకాల పుస్తకంలో కీలక విషయాలు వెల్లడించిన సోనియా
- తెలుగు ప్రజలు తనను రాజీవ్ గాంధీ భార్యగా కాక, ఇందిరమ్మ కోడలిగానే చూశారని వెల్లడి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, తెలుగు ప్రజలతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని తన తాజా ఆత్మకథలో గుర్తుచేసుకున్నారు. మిగతా 2లో

## 'మెట్రో పింక్ లైన్'ను ప్రారంభించిన ప్రధాని, కర్ణాటక సీఎంతో మెట్రో రైడ్

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్ణాటక పర్యటనలో భాగంగా బెంగళూరులో మెట్రో 'పింక్ లైన్' శుక్రవారం ప్రారంభించారు.
- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర ప్రముఖులతో కలిసి తవరేకెరె నుండి ఐఐఎం బెంగళూరు మెట్రో స్టేషన్ వరకు కొత్తగా ప్రారంభించిన 7.5 కిలోమీటర్ల మార్గంలో ఆయన ప్రయాణించారు.



బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్ణాటక పర్యటనలో భాగంగా బెంగళూరులో మెట్రో 'పింక్ లైన్' శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర ప్రముఖులతో కలిసి తవరేకెరె నుండి ఐఐఎం బెంగళూరు మిగతా 2లో

## కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే చూస్తూ ఊరుకోం



- భూములు అమ్మడమే ప్రభుత్వ పనా?: హరీష్‌రావు
- కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ధర్నా
- 3.15 ఎకరాల స్థలం వేలాన్ని నిరసిస్తూ స్థానికులతో కలిసి ఆందోళన
- ధర్నాలో పాల్గొన్న హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- నిరసనకు మద్దతు ప్రకటించిన వామపక్ష పార్టీలు

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మిగతా 2లో

## పి.ఎన్.ఎన్. నాగరాజుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

### - వీ.కోట అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజానాయకుడు






వీ.కోట, స్టేట్ బ్యూరో యు. గణపతి, జన చైతన్య ప్రతినిధి, నవంబర్ 13: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.ఎన్.ఎన్. నాగరాజుకు అంబేద్కర్ నగర్ వాసులు, వీ.కోట ప్రజలు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల పక్షాన నిలుస్తూ, వీ.కోట పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ప్రజా నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. వీ.కోటలో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ప్రతి వీధిలో హైమాస్ట్ దీపాలు, అంబేద్కర్ సర్కిల్, వైఎస్సార్ సర్కిల్ అభివృద్ధితో పాటు విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన కృషి చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడంలో ముందుంటారని కొనియాడారు. కరోనా కష్టకాలంలో ప్రజలు భయాందోళనలకు గురైన సమయంలో నిరుపేదలకు ఆహారం, మందులు, నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రాణభయంతో చాలామంది ఇళ్లకే పరిమితమైన సమయంలోనూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు భరోసా కల్పించారని ప్రశంసించారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నెల్లూరు, వైజాగ్, తిరుపతిలో కొత్త స్టార్ హోటళ్లు



- పర్యాటక రంగంలో పెట్టుబడులు: దుర్గేశ్
- పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజన్‌గా మారుస్తున్నామన్న కందుల దుర్గేశ్
- రూ.442.92 కోట్ల పెట్టుబడులతో మూడు స్టార్ హోటళ్లు రాబోతున్నాయని వెల్లడి
- టూరిజం రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామన్న మంత్రి

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ప్రధాన 'గ్రోత్ ఇంజన్'గా తీర్చిదిద్దుతున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. విశాఖలో జరుగుతున్న పెట్టుబడుల సదస్సులో ప్రముఖ ఆతిథ్య రంగ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన మిగతా 2లో

## విశాఖలో ఆర్టీఐహెచ్ ఆధ్వర్యంలో ఘనంగా స్టార్టప్ ఎక్స్‌ఛేంజ్ సదస్సు

**ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఏపీ లక్ష్యం**

- మొదటి విడతగా 31 స్టార్టప్‌లకు రూ.2.11 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకం
- రాష్ట్రవ్యాప్తంగా 25 పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ల ఏర్పాటుకు కార్యాచరణ
- ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధి



రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపుపై విచారణ జరపాలి



కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? దర్యాప్తు చేయాలంటూ కవిత డిమాండ్

ఫామ్‌హౌస్‌కు కెనాల్ ఉందా? లేదా? అనే అంశంపై బీఆర్ఎస్ స్పష్టతనివ్వాలన్న కవిత

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతితో తనకు ఎలాంటి సంబంధం లేదని వ్యాఖ్య

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మిగతా 2లో

## 'చంద్రబాబు, లోకేష్‌లు పేద పిల్లల ఉసురు పోసుకుంటున్నారు'

**చిత్తూరులో విద్యార్థిని ఆత్మహత్య.. ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ ఫైర్**

- పేదలను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్ర ఇది..
- మీ కుట్రలతో పేద కుటుంబాలు ఒత్తిడి భరించలేకపోతున్నాయి..
- ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఆ భారాన్ని పిల్లలు, వారి తల్లిదండ్రులమీద మోపుతున్నాయి.



తాడేపల్లి: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల చిత్తూరులో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి మిగతా 2లో

## 'నువ్వు ఇందిరమ్మ కోడలివి, అందుకే నీకు, కాంగ్రెస్‌కు ఓటేస్తాం'

తనకంటూ ఒక గుర్తింపు రాకముందు, రాజీవ్ గాంధీ భార్యగా కంటే కూడా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కోడలిగానే తెలుగు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని ఆమె వివరించారు. ఇటీవల ప్రచురితమైన "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" అనే తన జ్ఞాపకాల పుస్తకంలో ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2004లో జన సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పటి అనుభవాలను ఆమె పంచుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌ను సందర్శించిన అనంతరం విజయవాడకు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో 'ఇందిరమ్మ'కు మద్దతుగా నినాదాలు వినిపించాయని తెలిపారు. ఈ ప్రయాణంలో రోడ్డు పక్కన నిల్చున్న లంబాడీ (బంజారా) మహిళల బృందం తన దృష్టిని ఆకర్షించిందని సోనియా పేర్కొన్నారు. వారి సాంప్రదాయ ఎరుపు, నీలం రంగుల లెహంగాలు, అద్దాలతో కుట్టిన ఓణీలు చూసి, తన మెహందీ వేడుక నాటి దుస్తులను గుర్తుచేసుకుని వాహనం ఆపానని చెప్పారు.ఆ మహిళలు ఆప్యాయంగా తన తలపై ఓణీ కప్పి, తమ సంప్రదాయ దుస్తులకు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకుని ఆనందంతో నాట్యం చేశారని, తనను కూడా అందులోకి లాగారని సోనియా రాశారు. 'నువ్వు ఇందిరమ్మ కోడలివి, అందుకే నీకు, కాంగ్రెస్‌కు ఓటేస్తాం' అని ఆ మహిళలు తనతో చెప్పిన మాటలు ఎప్పటికీ గుర్తుంటాయని సోనియా తెలిపారు. ఈ సంఘటన ప్రజల నాడిని అర్థం చేసుకోవడానికి, తన రాజకీయ ప్రయత్నాలను కొనసాగించడానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ పుస్తకంలో తెలుగు నేతలకు సంబంధించిన పలు పాత రాజకీయ సంఘటనలను కూడా సోనియా ప్రస్తావించారు. 1969 రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ సిండికేట్ అభ్యర్థి అయిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఇందిరా గాంధీ.. వీవీ గిరికి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలన్న పిలుపుతో గిరి విజయం సాధించిన తీరును వివరించారు. అలాగే, 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత నెలకొన్న రాజకీయ సంక్షోభం సమయంలో జరిగిన పరిణామాలను కూడా ఆమె ఈ పుస్తకంలో పొందుపరిచారు.

## 'మెట్రో పింక్ లైన్'ను ప్రారంభించిన ప్రధాని, కర్ణాటక సీఎంతో మెట్రో రైడ్

మెట్రో స్టేషన్ వరకు కొత్తగా ప్రారంభించిన 7.5 కిలోమీటర్ల మార్గంలో ఆయన ప్రయాణించారు.రైలు ఎక్కే ముందు ప్రధాని మోదీ కౌంటర్ వద్ద యూపీఐ ద్వారా మెట్రో టికెట్ కొనుగోలు చేశారు. ఈ ప్రయాణంలో ఆయన వెంట కర్ణాటక సీఎం శివకుమార్, గవర్నర్ సుధా యాదవ్, బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వి సూర్య, మంత్రి కె.బి. గౌడ తదితరులున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రయాణికులతో ముచ్చటించారు. కలేన అగ్రహార నుండి తవరేకెరె వరకు అనుసంధానించే ఈ పింక్ లైన్‌ను సుమారు రూ. 3,470 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీని ప్రారంభం బెంగళూరు మెట్రో నెట్‌వర్క్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.కర్ణాటక పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రూ. 15,600 కోట్లకు పైగా విలువైన పలు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్: బెంగళూరు, తీరప్రాంత కర్ణాటక మరియు గోవా మధ్య వేగవంతమైన రైలు అనుసంధానాన్ని కల్పించే బెంగళూరు-మంగళూరు-మడ్గావ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు.అమృత్ భారత్ స్టేషన్లు: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేసిన చామరాజనగర్, చిక్కమగళూరు, సకలేశ్‌పూర్ మరియు సుబ్రహ్మణ్య రోడ్ అనే నాలుగు రైల్వే స్టేషన్లను ఆయన ప్రారంభిస్తారు.రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ: 284 కి.మీ. గదగ్-హోస్పేట్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగమైన 45 కి.మీ. బాగల్‌కోట్-వందాల్ రైల్వే లైన్ డబ్లింగ్ సెక్షన్‌ను, అలాగే 55 కి.మీ. సకలేశ్‌పూర్-సుబ్రహ్మణ్య రోడ్ ఘాట్ రైల్వే సెక్షన్ విద్యుదీకరణ పనులను ఆయన జాతికి అంకితం చేస్తారు. దీంతోపాటు సుమారు రూ. 4,450 కోట్ల వ్యయంతో కొప్పళ-×× మరియు గదగ్-×× లలో నిర్మించిన పునరుత్పాదక ఇంధన మండలాల అనుసంధాన ట్రాన్స్‌మిషన్ పథకాన్ని , అలాగే సుమారు రూ. 1,370 కోట్ల పెట్టుబడితో బీదర్‌లోని సౌర ఇంధన మండలం కోసం నిర్మించిన ట్రాన్స్‌మిషన్ పథకాన్ని ప్రధాని ప్రారంభిస్తారు.

## కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములు అమ్ముతుంటే చూస్తూ ఊరుకోం

ఈ నిరసనకు సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి. కూకట్‌పల్లిలో ప్రజావసరాల కోసం కేటాయించిన 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ఈ నెల 27న ప్రభుత్వం వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తుండటం తో ఈ నిరసన మొదలైంది. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందలతో కలిసి హరీశ్ రావు ట్రక్ పార్క్ స్థలాన్ని పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. భూముల వేలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ట్రక్ పార్క్ భూములు అమ్మితే ఊరుకోం. భూములు అమ్మడమే ప్రభుత్వ పనా? ఎక్కడ భూమి కనబడినా అమ్ముడేనా? రేవంత్ రెడ్డి పాలన కాకుండా.. రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మబోమని చెప్పారు. ఇప్పుడు భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారు. కాప్రా, అమీన్‌పూర్‌లలో కూడా ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు.గతంలో 2013లోనూ ఇదే భూమిని విక్రయించేందుకు ప్రయత్నించినప్పుడు రాజకీయ పక్షాలన్నీ ఏకమై అడ్డుకున్నాయని నేతలు పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాలను వ్యాపార ప్రయోజనాల కోసం అమ్మడం సరికాదని, ప్రభుత్వం వెంటనే ఈ వేలాన్ని విరమించుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలశీపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కూకట్‌పల్లి ట్రక్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసనకు దిగింది. ఆందోళనలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. ట్రక్ పార్క్ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ట్రక్ పార్క్ భూములు అమ్మితే ఊరుకోం అని హరీష్‌రావు తేల్చి చెప్పారు.భూములు అమ్మడమే ప్రభుత్వ పనా?. ఎక్కడ భూమి కనబడినా అమ్ముడేనా?. రేవంత్ ప్రభుత్వ పాలన కాదు.. రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. రేవంత్ మాటలు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మమని చెప్పారు. ఇప్పుడు భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారు. రేవంత్ కన్నుపడితే చాలు.. భూములు అమ్మడమే" అంటూ హరీష్‌రావు దుయ్యబట్టారు.

## నెల్లూరు, వైజాగ్, తిరుపతిలో కొత్త స్టార్ హోటళ్లు

ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని నెల్లూరు, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో మొత్తం రూ.442.92 కోట్ల భారీ పెట్టుబడులతో మూడు నూతన స్టార్ హోటళ్లు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ, నెల్లూరులో డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ సంస్థ రూ.139.92 కోట్ల వ్యయంతో 123 గదుల అత్యాధునిక హోటల్‌ను నిర్మించనుందని మంత్రి తెలిపారు. అలాగే, పర్యాటక రాజధాని విశాఖపట్నంలో రూ.115 కోట్ల పెట్టుబడితో 98 గదుల సామర్థ్యంతో 'ది పార్క్ హోటల్స్' ప్రాజెక్ట్ రానుందని చెప్పారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి సమీపంలోని రేణిగుంట వద్ద రూ.188 కోట్లతో గ్రాండ్ తిరుపతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన స్టార్ హోటల్‌ను నెలకొల్పనున్నట్లు వివరించారు.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని వేగంగా విస్తరించేందుకు ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని, ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక నగరాల్లో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు. ఈ భాగస్వామ్యాల ద్వారా పర్యాటక మౌలిక సదుపాయాలు బలోపేతం కావడమే కాకుండా, స్థానికంగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థిక ప్రగతికి గ్రోత్ ఇంజన్‌గా మారుస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. పెట్టుబడుల సదస్సులో పలు సంస్థలతో ఎంఓయూలూ చేసుకున్నట్లు తెలిపారు. రూ.139.92 కోట్లతో నెల్లూరులో డీఎస్ఆర్ హాస్పటాలిటీ సర్వీసెస్ (123 గదులు), విశాఖలో రూ.115 కోట్లతో ది పార్కు హోటల్స్ (98 గదులు), రూ. 188 కోట్లతో తిరుపతిలోని రేణిగుంట వద్ద గ్రాండ్ తిరుపతి హోటల్స్, రిసార్ట్స్ ప్రైవేటు స్టార్ హోటల్ రానున్నాయని వెల్లడించారు.

## పంచాయతీ ఎన్నికలైనా నిష్పాక్షికంగా జరగాలి

తీవ్ర విమర్శలు చేశారు. మున్సిపల్, మండల పరిషత్ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడంలో విఫలమైందని ఆరోపించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలైనా ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేలా చూడాలని డీఐజీ కోయ ప్రవీణ్‌ను కోరారు.మాజీ మంత్రి బుగ్గన తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. గతంలో జరిగిన మున్సిపల్, మండల పరిషత్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఘర్షణలు, దాడులు, దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలను దేశమంతా చూసింది. ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు ఉందని, అయితే ఎన్నికల సమయంలో జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలతో రాష్ట్రాన్ని బీహార్‌లా మార్చేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే దౌర్జన్యాలు జరిగాయని బుగ్గన ఆరోపించారు. టీడీపీ శ్రేణులు నామినేషన్ పత్రాలను చించివేశాయని, అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేశాయని అన్నారు. గత ఎన్నికల్లో జరిగిన ఈ ఘటనలన్నింటినీ డీఐజీ కోయ ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు అత్యంత కీలకమని బుగ్గన పేర్కొన్నారు. రాజకీయాలు పుట్టిందే గ్రామాల నుంచి అని, అందుకే గ్రామస్థాయి ఎన్నికలను ఎలాంటి ఒత్తిళ్లు, దాడులు, దౌర్జన్యాలు లేకుండా నిర్వహించాలని కోరారు.కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టిపోయాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయకుండా ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని డీఐజీని కోరినట్లు బుగ్గన వెల్లడించారు. గత ఎన్నికల తరహా ఘటనలు పునరావృతం కాకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## రాజమండ్రి నగరపాలక సంస్థపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

రాజమండ్రి నగరపాలక సంస్థపై బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. స్థానిక అభ్యర్థికే మేయర్ టికెట్ కేటాయిస్తామని తెలిపారు. కార్యకర్తల అభిప్రాయాల మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. శుక్రవారం రాజమండ్రిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లోనూ 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.రానున్న గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని అన్నారు. పుష్కరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ వార్షిక సీఐఐ సదస్సుకు మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు పెరిగేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో 4 పీఆర్‌టీఎస్ కారిడార్లు.. ఏడాదిలోనే తొలిదశ పూర్తి

వేగవంతమైన రాకపోకలను సాధ్యం చేయడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ వ్యవస్థతో ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా, కాలుష్యాన్ని కూడా నియంత్రించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిపాదిత కారిడార్లు ఇవే..

తొలి దశలో భాగంగా అధికారులు నాలుగు కీలక కారిడార్లను ప్రతిపాదించారు.

ఒకటి: ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్ లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్ స్టేషన్ వరకు.

రెండు: అసెంబ్లీ మెట్రో స్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమ్యాక్స్ మీదుగా బేగంపేట వరకు.

మూడు: పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ల వరకు.

ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే కేపీహెచ్‌బీ – మైండ్‌స్పేస్ మార్గాన్ని తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కార్యకలాపాలకు మద్దతుగా నెక్లెస్ రోడ్ మరియు గచ్చిబౌలిలోని ఐకియా సమీపంలో ప్రత్యేక డిపోలతో కూడిన మల్టీ-లెవల్ పార్కింగ్ సముదాయాలను నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కానున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా సీఎంతో పాటు ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సమ్మతి ఇప్పించాలని కోరనున్నారు. ఈ ప్రాజెక్టుకు సత్వరమే అనుమతులు ఇప్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (ఏఐబీపీ) కింద ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి అవసరమైన అనుమతులతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎన్ఓసీ ఇప్పించాలని కోరనున్నారు.గోదావరి--కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ పరిధిలోని ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై బరాజ్ నిర్మించి అక్కడి నుంచి నీళ్లను తరలించాలని, తరలించే నీళ్లలో 50 శాతం వాటాను తెలంగాణకు కేటాయించాలని కోరనున్నట్టు తెలిసింది. సీతమ్మసాగర్ బరాజ్, డిండి, పాలమూరు--రంగారెడ్డి తదితర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను సత్వరమే ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించనున్నారు.రాష్ట్రంలో నిర్మిస్తున్న ఇతర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ఆర్థిక సహాయాన్ని కూడా కోరనున్నట్టు తెలిసింది.చెరువుల ఆక్రమణలతోనే కాలనీలు జలమయం

హైదరాబాద్ నగరం అంటేనే 'రాక్స్ అండ్ లేక్స్ సిటీ' అని సీఎం గుర్తుచేశారు. గతంలో నగరంలో 1372 చెరువులు ఉండేవని, కానీ వివిధ కారణాలు, ఆక్రమణల వల్ల దాదాపు 50 శాతం చెరువులు కనుమరుగైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను కబ్జా చేయడం వల్లే కొద్దిపాటి వర్షం పడినా రోడ్లపైకి నీళ్లు రావడం, కాలనీలు చెరువులను తలపించడం జరుగుతోందని.. ఈ దుస్థితిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. వందేళ్ల క్రితమే మూసీ వరదల నుంచి నగరాన్ని రక్షించడానికి నిజాం పాలకులు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారని, ముచుకుందా నది.. మూసా, ఈసా సంగమంతో మూసీగా రూపాంతరం చెంది నదీ నాగరికతకు కేంద్రంగా మారిందని గుర్తుచేశారు.

మూసీ ప్రక్షాళన ఆగదు.. బాధితులకు అండగా ఉంటాం

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ తీవ్రంగా కలుషితమైందని, ఆ విషపు నీటి ప్రభావంతో నల్లగొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా తీవ్ర అనారోగ్యాలతో శిక్ష అనుభవిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మూసీ పునరుజ్జీవనం చేపట్టాలని సంకల్పించామని చెప్పారు. "మూసీకి కావాల్సింది కేవలం బాహ్య సుందరీకరణ కాదు.. దానికి పూర్తిస్థాయి పునరుజ్జీవం కల్పించడమే మా లక్ష్యం. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరికీ అన్యాయం లేదా నష్టం జరగకుండా ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటుంది. త్వరలోనే మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులను ప్రారంభిస్తాం" అని వెల్లడించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని, నగరాభివృద్ధి కోసం అన్ని పక్షాలూ రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.నగరంలోని చెరువులను కాపాడుకుంటూనే వాటి చుట్టూ 'లేక్ ఎకానమీ'ని ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఏపీ రాజధానిలో ఒబెరాయ్ ఫైవ్ స్టార్ హోటల్

సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) అధికారికంగా కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సీఆర్‌డీఏ అధికారులు, ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులు ఈ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ ద్వారా రాజధాని నగరానికి దాదాపు రూ.174 కోట్ల మేర పెట్టుబడులు రానున్నాయి.ఈ లగ్జరీ హోటల్ ప్రాజెక్టు రాకతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. దాదాపు 150 మందికి ప్రత్యక్షంగా, మరో 250 మందికి పరోక్షంగా.. మొత్తంగా 400 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డిలతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే క్రమంలో ప్రముఖ బ్రాండ్లు రాజధానికి రావడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. హోటల్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సీఐఐ భాగస్వామ్య సదస్సులో తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. సదస్సు రెండో రోజున సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మ నిర్వహించిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను చేపట్టిన సంస్కరణలు, ముఖ్యంగా ఐటీ రంగంలో తన దార్శనికత గురించి చంద్రబాబు వివరించారు.భవిష్యత్తు ఐటీ రంగానిదేనని తాను ఆనాడే ఊహించి, దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు తెలిపారు. ఈ క్రమంలో మైక్రోసాఫ్ట్ బిల్ గేట్స్‌ను కలిసి, హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేలా ఒప్పించిన విధానాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. భారతదేశంలో గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో నైపుణ్యం ఉన్న మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఇది ఐటీ రంగ విస్తరణకు ఎంతగానో దోహదపడుతుందని తాను బిల్ గేట్స్‌కు వివరించినట్లు చెప్పారు.ఐటీ పరిశ్రమకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతులు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. అయితే, తాను ఐటీకి ప్రాధాన్యత ఇస్తుంటే, నాటి ప్రతిపక్షాలు తనను తీవ్రంగా విమర్శించేవని అన్నారు. కేవలం ఐటీ రంగమే కాకుండా దేశంలోనే మొట్టమొదటిసారిగా విద్యుత్ సంస్కరణలు కూడా తానే తీసుకొచ్చానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు 12 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఏపీ సీఆర్‌డీఏ, ఏపీ మారిటైమ్ బోర్డు, ఐటీ ఎలక్ట్రానిక్స్‌తో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పీ4 నమూనాకు సంబంధించి ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన జీవోలను సీఎం స్వయంగా సంస్థల ప్రతినిధులకు అందజేశారు.ఈ సదస్సులో పేదల సంక్షేమం, సాధికారతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. స్వర్ణాంధ్ర ఫౌండేషన్‌తో కలిసి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా హీరో మోటోకార్ప్ సంస్థ 28 జిల్లాల్లోని 1,120 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు రూ.32.48 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. అలాగే, 100 గ్రామాల్లోని 25 వేల 'బంగారు కుటుంబాల' జీవనోపాధి, జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఐటీసీ లిమిటెడ్ ఆ కుటుంబాలను దత్తత తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పీ4 కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 11.37 లక్షల కుటుంబాలను వివిధ సంస్థలు, వ్యక్తులు దత్తత తీసుకోగా, లక్ష మందికి పైగా మార్గదర్శకులుగా నమోదయ్యారు.సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "పెట్టుబడులు లేకపోతే సంపద సృష్టి జరగదని.. అందుకే తాను పీపీపీ(ప్రభుత్వ-ప్రైవేట్-పీపుల్ భాగస్వామ్యం), పీ4 మోడల్‌ను నమ్ముతున్నట్లు స్పష్టం చేశారు. ఐటీ శకం ముగుస్తోందని, ఏఐ, క్వాంటం శకం మొదలైందని ఆయన వివరించారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే సంస్కరణలు వేగవంతమవుతాయని, తలసరి ఆదాయంలో ఏపీ ప్రస్తుతం 13వ స్థానంలో ఉందని పేర్కొన్నారు. "నా పాలసీల వల్లే స్థానిక ఎన్నికల్లో మా ఓట్ షేర్ పెరిగింది. ప్రజలకు మంచి చేస్తే.. వాళ్లే ఆశీర్వదిస్తారు" అని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర జనాభా విధానంలో తీసుకువచ్చిన వ్యూహాత్మక మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ విధానాల నుంచి బయటకు వచ్చి, ఎక్కువ మంది పిల్లలను కనేలా ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు వేగంగా పడిపోతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని తెలిపారు.రాష్ట్రంలో జనాభా నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌లో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) గణనీయంగా తగ్గి ప్రస్తుతం దాదాపు 1.5 వద్దకు చేరుకుంది. జనాభా సమతుల్యతను కాపాడేందుకు అవసరమైన 2.1 రీప్లేస్‌మెంట్ స్థాయి కంటే ఇది చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఎదురవుతున్న వృద్ధాప్య జనాభా సమస్య, యువ శ్రామిక శక్తి కొరత వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం ఈ విధాన మార్పును తెరపైకి తెచ్చింది.విశాఖలో జరుగుతున్న 31వ సీఐఐ సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మకు ఇచ్చిన ముఖాముఖిలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై మాట్లాడారు. గతంలో ఒకటి లేదా ఇద్దరు పిల

## బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరితో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ



పాట్నా ధరువు న్యూస్: బీహార్ రాజధాని పాట్నాలోని నివాసంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరిని బీజేపీ జాతీయ నాయకులు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ భేటీ సంతోషాన్ని కలిగించిందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

## పెళ్లికి ముందు యువతీ యువకులు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలి



-ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షలు పెంచాలి..
-రక్తనిల్వల కొరత లేకుండా చూడాలి

పుట్టపర్తి, ధరువు న్యూస్: వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు యువతీ యువకులు స్వచ్ఛందంగా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేయించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశంలో ఆయన హెచ్ఐవీ నియంత్రణ చర్యలు, బ్లడ్ బ్యాంకుల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవీ పరీక్షల ప్రయోజనాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గోడపత్రికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలతో పాటు హెచ్ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి వెంటనే యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) చికిత్స అందించాలని ఆదేశించారు. సుఖవ్యాధుల చికిత్సా కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలని, జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల్లో ఎల్లప్పుడూ సరిపడా రక్త నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రక్త కొరత తలెత్తకుండా తరచుగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి కార్మికులకు, అవసరమైన వర్గాలకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంతకుముందు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ ప్రణయ్, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ హిమచంద్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



అనంతపురం, ధరువు న్యూస్: ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చదవటం మాకిష్టం' (ఔవ ాశీజవ =ఘఎఅఅస్త్ర) నినాదంతో నిర్వహించే వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని సిబ్బందికి



సూచించారు. వారోత్సవాల విజయవంతానికి అవసరమైన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గంలో కూటమి విజయోత్సవ ర్యాలీ





కళ్యాణదుర్గం, ధరువు న్యూస్: కళ్యాణదుర్గం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు విజేతలకు అభినందనలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బుట్ట లక్ష్మితో పాటు 28 వార్డుల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకానికి ఈ విజయం నిదర్శనమన్నారు. కళ్యాణదుర్గం పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని, స్థానిక ఎమ్మెల్యే అమిలేని సురేంద్రబాబు నాయకత్వంలో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలేని సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కూటమి నాయకులు, 28 వార్డుల విజేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది

అనంతపురం, ధరువు న్యూస్: జనాభా గణన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం జేఎన్‌టీయూలోని ఈఈఈ బ్లాక్ సెమినార్ హాలులో జిల్లా, చార్జ్ స్థాయి అధికారులకు నిర్వహించిన జనగణన-2027 రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలి దశలో చేపట్టిన గృహాల జాబితా, గృహ గణన ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేసిన అధికారులను అభినందించారు. ప్రస్తుతం ప్రారంభమైన రెండో దశ జనాభా గణనను ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, వలసలు, భాష, సంతాన వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలన్నారు. జనగణన-2027 దేశంలో 16వది కాగా, స్వాతంత్ర్యం అనంతరం 8వ జనాభా గణన అని తెలిపారు. దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జనాభా గణన చేపడుతున్నందున ప్రత్యేక మొబైల్ యాప్‌ల ద్వారా వివరాల సేకరణ జరుగుతుందని, కుటుంబాలకు స్వీయ గణన చేసుకునే అవకాశం కూడా కల్పించామని వివరించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎదురయ్యే సందేహాలను అధికారులు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలోల, డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహ, జనగణన



అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మాస్టర్ ట్రైనర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడు విద్యార్థిని గోపికకు వైఎస్సార్‌సీపీ రూ.5 లక్షల ఆర్థిక సాయం



రాప్తాడు ధరువు న్యూస్: రంపం దాడిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడుకు చెందిన విద్యార్థిని గోపిక కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. గతంలో బెంగళూరులోని ఆసుపత్రికి వెళ్లి గోపికను పరామర్శించిన వైఎస్ జగన్, ఆ కుటుంబానికి పార్టీ తరఫున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గోపిక కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## బత్తలపల్లి గ్యాస్ సరఫరా సమస్యపై మంత్రి సత్యకుమార్ తక్షణ స్పందన

బత్తలపల్లి, ధరువు న్యూస్: బత్తలపల్లి మండలంలో గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యంతో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ స్పందించారు. 48 గంటల్లో సమస్యను పరిష్కరించి, వారం రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్యాస్ బుకింగ్ చేసినప్పటికీ సకాలంలో సిలిండర్లు అందకపోవడం, ఓటీపీ ఇచ్చిన తర్వాత కూడా సరఫరాలో జాప్యం జరగడం, వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి సిలిండర్లు తెచ్చుకోవాల్సి రావడంపై మంత్రి తన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబును సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో హరీష్ బాబు



జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధి వెంకన్నతో మాట్లాడి సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు 48 గంటల్లో సరఫరా సమస్యను పరిష్కరిస్తామని, వారం



రోజుల్లో శాశ్వత చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బుకింగ్ చేసుకున్న ప్రతి వినియోగదారుడికి సకాలంలో గ్యాస్ సిలిండర్ అందేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించినట్లు హరీష్ బాబు తెలిపారు.

## 27వ వార్డులో వీధిలైట్ల ఏర్పాటు పనులు ప్రారంభం



పుట్టపర్తి ధరువు న్యూస్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో వీధిలైట్లు లేని ప్రాంతాలను గుర్తించి, స్థానిక ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవుల సుబ్రమణ్యం, హోటల్ జనార్ధన్ చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా వార్డులో పర్యటించిన వారు వీధిలైట్లు లేని ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, కొత్తగా వీధి దీపాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. రాత్రి వేళల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురుకాకుండా, రహదారులు, వీధుల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నాయకులు ముందుకు రావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు




శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి ధరువు న్యూస్: త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అల్లర్లు, రాజకీయ ఘర్షణలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు. బెయిల్‌పై ఉన్నవారు షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు చర్యలు తీసుకుని తిరిగి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తుగా సమర్పించిన రూ.5 లక్షలను ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంతో పాటు ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల మాదిరిగానే సర్పంచ్ ఎన్నికలు కూడా ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీలు శివనారాయణ స్వామి, బీవీ జగన్నాథరాజు, సీఐలు రామసుబ్బయ్య, సునీత, ఎస్సైలు కృష్ణవేణి, శేఖర్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

- చాందిని మసీద్‌లో ముస్లిం, మైనార్టీలతో కలయిక
- దువా చేసిన మేయర్ రమేష్ గౌడ్



**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నగరంలోని మూడవ రోడ్డులో ఉన్న చాందిని మసీదులో ముస్లిం, మైనార్టీలతో కలిసి మేయర్ రమేష్ గౌడ్ దువా చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలను అలింగనం చేసుకుని వారిని అభినందించారు. ఎన్నికల్లో వారు చేసిన సహకారానికి, విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సహకారంతోనే గెలుపు సాధ్యమైందని మేయర్ రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలతో పాటు అన్ని సంఘాల వారు పార్టీకి అందించిన మద్దతును గుర్తుంచుకుంటానని తెలియజేశారు. భవిష్యత్తులో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని, నగర అభివృద్ధికి అందరి సహకారం అవసరమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మాజీ కార్పొరేటర్లు ఇషాక్, అశోక్ రెడ్డి, ముస్లిం, మైనార్టీలు హిద్దు, షకీల్, సవిద్, జిలాన్, ఫయాజ్, ఆరిఫ్, కరీం, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫోకస్

- అభ్యర్థుల ఎంపికపై గ్రామాల వారిగా సుదీర్ఘంగా సాగిన కసరత్తు
- అనంతపురం క్యాంప్ కార్యాలయంలో నాయకులతో సుదీర్ఘ భేటీ
- ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జడ్పీటీసీ, ఎంపీటీసీలు



**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**

రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. గ్రామాల సమగ్ర అభివృద్ధి జరగాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ లుగా టీడీపీకి అనుకూలంగా ఉన్న వారే ఉండాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పంచాయతీ ఎన్నికలలో కూటమి సానుభూతిపరుల విజయమే లక్ష్యంగా ఆమె అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చ సాగింది. ఎన్నికల బరిలో నిలిపే అభ్యర్థుల ఎంపిక విషయంలో అత్యంత పారదర్శకంగా, ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఒకే అభ్యర్థి పోటీకి సిద్ధంగా ఉన్న గ్రామాలలో వారి పేరును తక్షణమే ఖరారు చేస్తున్నారు. అదేవిధంగా ఒకటి కంటే ఎక్కువగా ఇద్దరు లేదా ముగ్గురు ఆశావహులు పోటీ పడుతున్న గ్రామాలలో పార్టీ నాయకులందరితో కూలంకశంగా చర్చిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన వ్యక్తి అనేది గుర్తించి అభ్యర్థులను సూచించి నిర్ణయం తీసుకుంటున్నారు. పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా, అందరూ కలిసికట్టుగా పనిచేసి మెజారిటీ పంచాయతీలను కైవసం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఘనవిజయం సాధించిన ప్రజాప్రతినిధులు అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం రూరల్ మండల జడ్పీటీసీగా విజయం సాధించిన మాధవి, కక్కలపల్లి కాలనీ-1 నుంచి ఎంపీటీసీగా విజయం సాధించిన శివ భాస్కర్, సోమలదొడ్డి నుంచి ఎంపీటీసీగా విజయం సాధించిన మారుతి ప్రసాద్ రెడ్డి, కక్కలపల్లి నుంచి ఎంపీటీసీగా విజయం సాధించిన సరోజమ్మ, అలాగే ఆత్మకూరు మండలం సనప నుంచి ఎంపీటీసీగా విజయం సాధించిన పోతలయ్యలు ఆయా మండల, గ్రామాల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సునీతను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వీరందరినీ ఎమ్మెల్యే అభినందించి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అనంతపురాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం



- నూతన కార్పొరేటర్లు, ఎంపీటీసీల సన్మాన సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- కూటమి తరపున గెలిచిన 41 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎంపీటీసీలకు ఘన సత్కారం
- గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరానికి చేసిందేమీ లేదని విమర్శ
- రూ.1,400 కోట్లతో నగరాభివృద్ధి చేశామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- నగరాభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామన్న ఎమ్మెల్సీ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావు

**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**

అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేసి చూపిస్తామని.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం నగరపాలక సంస్థ, రూరల్ పరిధిలో కూటమి తరపున నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావుతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థలో కూటమి తరపున విజయం సాధించిన 41 మంది కార్పొరేటర్లను, రూరల్ పరిధిలో గెలిచిన 9మంది ఎంపీటీసీలను నాయకులంతా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన 41 మంది కార్పొరేటర్లు, 9 మంది ఎంపీటీసీలు నగర గ్రామాల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, మేయర్ అభ్యర్థి ఓటమికి గల పరిస్థితులను సమీక్షించుకుంటా మని, ఎక్కడ లోపాలు జరిగాయో పరిశీలించి సరిదిద్దుకుంటామని తెలిపారు. గత వైసీపీ పాలనపై, మాజీ ఎమ్మెల్యే అనంత తీరుపై ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరంలో కనీసం ఒక్క కొత్త రోడ్డు గానీ, డ్రైనేజీ గానీ వేయలేదన్నారు. ఆయన కేవలం టవర్ క్లాక్ మీదుగా ఉన్న రోడ్డు మాత్రమే వేశారని, అదికూడా 2018లో టీడీపీ హయాంలో మంజూరైన రోడ్డు అని అన్నారు. 40ఏళ్ల ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే ఆయన, నగరానికి చేసిందేమీ లేదని.. కేవలం ఆయన తండ్రి విగ్రహం పెట్టుకోవడం తప్ప ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సమర్థవంతమైన పనితీరు వల్ల రాష్ట్రానికి రూ. 20లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోంద న్నారు. ఒక్క అనంతపురం నగరంలోనే రూ.1,400 కోట్లతో భారీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. భవిష్యత్తులో మరింత వేగంగా అభివృద్ధి పనులు చేస్తామని వివరించారు. రాయలసీమ ప్రగతి గురించి ప్రస్తావిస్తూ.. మదనపల్లిలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ప్రారంభించామని, పుట్టపర్తిలో లక్ష కోట్ల పెట్టుబడులతో డిఫెన్స్ ఇండస్ట్రీస్‌ను తీసుకువచ్చామని తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో రైతులకు ఒక్క డ్రిప్ కూడా ఇవ్వలేదని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలోనే రూ. 300 కోట్ల సబ్సిడీతో అనంతపురం జిల్లా రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించామన్నారు. అలాగే హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 1,800 క్యూసెక్కుల నుంచి 3,500 క్యూసెక్కుల వరకు పెంచి సాగునీరు అందించామన్నారు. ఎమ్మెల్సీ రమాదేవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జనసేన నగర అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ.. నూతనంగా గెలిచిన కార్పొరేటర్లు, ఎంపీటీసీలందరికీ అభినందనలు తెలిపారు. ప్రజలు కూటమిపై ఎంతో నమ్మకంతో ఈ విజయాన్ని అందించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

## టీడీపీని వీడి వైఎస్ఆర్‌సీపీలో చేరిక



**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**

అనంతపురం రూరల్ పంచాయితీలో తెలుగుదేశం పార్టీకి షాక్ తగిలింది. టీడీపీ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు ఆ పార్టీని వీడి వైఎస్ఆర్‌సీపీలో చేరారు. శుక్రవారం వైయస్సార్ సీపీ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో అనంతపురం రూరల్ పంచాయితీ మాజీ వార్డు మెంబర్లు గంగాధర్, షెక్షావలి, నాయకుడు మంజునాథ్ లు వైసీపీ కండువా కప్పుకున్నారు. అనంత వెంకటరామిరెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించారు. సందర్భంగా అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ బలపరుచనున్న సర్పంచ్, వార్డు అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ రమేష్ గౌడ్, అనంతపురం రూరల్ పంచాయితీ నాయకులు మహేష్, సుధాకర్ రెడ్డి, నగేష్, అశోక్, శీనా తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**పామిడి, నవంబర్ 13, దరువు న్యూస్ :**



వాసవి కళ్యాణ మండపం (అమ్మవారి శాల) పామిడి నందు ఈనెల 15వ తేదీ ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ అధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటి చూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైతే అన్ని రకాల కంటి ఆపరేషన్లకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. శంకర కంటి ఆసుపత్రి వారు ప్రత్యేక బస్సుల్లో బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు అనంతరం తిరిగి గమ్యస్థానాలకు చేరుస్తారని లయన్స్ క్లబ్ సభ్యులు తెలియజేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని రావాలని తెలియజేశారు. ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని పామిడి మండల ప్రజలు, పామిడి చుట్టూ ప్రక్కల ఉన్నటువంటి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు కోరారు.

# రామగిరిలో లెప్రసీ ఫోకల్ సర్వే నిర్వహణ



**పామిడి, నవంబర్ 13, దరువు న్యూస్ :**

మండల పరిధిలోని రామగిరి గ్రామంలో శుక్రవారం లెప్రసీ ఫోకల్ సర్వే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎద్దులపల్లి వైద్యాధికారి డాక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.ఉదయార్ రామగిరి గ్రామస్థులకు లెప్రసీ వ్యాధి లక్షణాలు, వ్యాధి తీవ్రత, తగిన సమయంలో చికిత్స తీసుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స చేయడం ద్వారా దానిని పూర్తిగా నయం చేయవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ ఎద్దులపల్లి ఆరోగ్య సిబ్బంది 10 గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపు 32 ఇళ్ల పరిధిని కవర్ చేస్తూ మొత్తం 320 ఇళ్లలో ఇంటింటికి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో రెండు అనుమానిత కేసులు గుర్తించబడినట్లు అధికారులు తెలిపారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందించడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో ఈ సర్వే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని వైద్యాధికారులు తెలిపారు. లెప్రసీ వ్యాధి చర్మంపై మచ్చలు, మరిగే అవగాహన తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, వ్యాధిని తీవ్రంగా తీసుకోకూడదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని ఆరోగ్యశాఖ గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ రామచంద్ర, హెల్త్ సూపర్వైజర్లు ఎం.సుధాకర్, టి.శ్రీరామరెడ్డి, ఎన్.పద్మావతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్ఎలు, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

# శ్రీచైతన్యలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు

**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**



శ్రీచైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలను పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి మొట్టమొదటి ప్రధాని అయిన జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పిల్లలంటే ఇష్టం అందుకే ఆయన జన్మదినోత్సవ వేడుకలను బాలల దినోత్సవం వేడుకగా జరుపుకుంటాము. పిల్లలందరూ ఆయనను ఎంతో ప్రేమగా చాచా అని పిలిచేవారు. పిల్లలు కల్మషం లేని మనసులకు ప్రతిరూపాలు వారికి మంచి విలువలు నేర్పిస్తే మన దేశం అభివృద్ధి పతంలోనడుస్తుంది. వారి సంతోష కరమైన బాల్యానికి తల్లిదండ్రులతో సహా సమాజం కూడా మంచి మాటలు వేయాలి. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నెహ్రూ మాటలకు అనుగుణంగా వారి భవిష్యత్తును మనం తీర్చిదిద్దాలి. మంచి విద్య మంచి ఆరోగ్యం, సురక్షితమైన వాతావరణం మనం వారికి కల్పించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణ మంతా కోలాహలంగా, ఎంతో సందడిగా అగుపించినది విద్యార్థులందరికీ సుబ్బారెడ్డి బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పురుషోత్తం, డీన్ చిరంజీవి, సుప్రజ, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జులు అఫ్రీన్, శారద, పద్మజ, ఏఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చవ్వా రాజశేఖర్ రెడ్డిని కలిసిన మేయర్ రమేష్ గౌడ్

**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**



చిత్తూరు జిల్లా వైసీపీ పరిశీలకులు, సీనియర్ నాయకులు చవ్వా రాజశేఖరరెడ్డిని అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం విజయానికి దోహదపడ్డాయని అభిప్రాయపడినట్లు తెలిపారు.

## 17న దేవాలయంలో కార్తీక దీపోత్సవం

**పామిడి, నవంబర్ 13, దరువు న్యూస్ :**

17వ తేదీ మంగళవారం కార్తీకమాస శుభ సందర్భంగా, శ్రీమడికట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతివారం జరిగేటట్లే హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించబడుతుంది. అదే దేవాలయంలో శివాలయం కూడా ఉన్నందున, ఈ పవిత్ర కార్తీకమాస సందర్భంగా కార్తీకదీపోత్సవం కూడా నిర్వహించాలని నిర్ణహించారు. ఈ సందర్భంగా భక్తాదులందరికి, మాతృమూర్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె ఏర్పాటు చేయబడుతున్నాయి. కావున, దీపోత్సవానికి ఒక గంట ముందుగా వచ్చి దీపాలంకరణలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా భక్తులందరినీ కోరారు.

## పని దినాల్లోనే సర్పంచ్ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి : జిల్లా ఫ్యాప్టో నేతల వినతి



**అనంతపురం, నవంబర్ 13, దరువు న్యూస్ :**

గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలను ఆదివారాల్లో కాకుండా పని దినాల్లోనే నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో అనంతపురం జిల్లా శాఖ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మలోలకి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ఉపాధ్యాయులకు సొంత లేదా సమీప మండలాల్లోనే ఎన్నికల విధులు కేటాయించాలని, ఆరోగ్య సమస్యలున్న ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులకు, పదవ తరగతి విద్యా కార్యక్రమాల్లో నిమగ్నమైన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే పోలింగ్ మరుసటి రోజు విధులు నిర్వహించిన సిబ్బందికి ఒకరోజు ఓడీ, ఎన్నికల సిబ్బందికి సామాన పారితోషికం, నాణ్యమైన భోజనం, తాగునీరు, కనీస వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల ఆరోగ్యం, విశ్రాంతి, విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కోటేశ్వరప్ప, రమణారెడ్డి, రవీంద్ర, వెంకటరత్నం, రామాంజనేయులు, గోవిందరాజులు, అశోక్ నాయక్, గోపాల్‌రెడ్డి, నాగేంద్ర, హనుమంతు, అజయ్ కుమార్, సమీవుల్లా పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.